కథానిక

# అన్నయ్య వెలిగించుకున్న జ్యోతి

ఉక్కుడాల రామమూర్తి

మా అన్నయ్య వెంకట్రామయ్యకు మొన్ననే యిరవై తొమ్మిది దాటి ముప్పైలో పడింది వయస్సు. ఇంతకూ వయస్సును గురించి ఎందుకు చెబుతున్నానంటే - ముప్పయ్యో వసంతం చూడబోతున్న ఆయనకు పెండ్లి కాలేదని చెప్పేందుకే. అటు పట్టణమూ యిటు పల్లె కాంపాకాని మా వూరిలో యింత వయస్సు వచ్చినా పెండ్లికాని మొగాడున్నాడంటే మా వెంకట్రామయ్యా తప్ప మరొక్కడు కంచుకాగడా వేసినా కన్పించడు. మా వూరిలో అబ్బాయిలకు ఇరవయ్యో సంవత్సరం నిండకూడదు. పెండ్లి చేసెయ్యాల్సిందే. ఇక అమ్మాయిలమాట చెప్పనవసరం లేదు. పదహారో సంవత్సరానికి చంకలో పిల్లో, పిల్లాడో కేరుమంటుండాలిసిందే. ఇలాంటి వూరిలోనూ అన్నయ్య ఇంత వయస్సు వచ్చినా పెండ్లి చేసుకోకపోవడం చూచి నీలాటి రేవుకాడి అమ్మలక్కలు, "అయ్యో! ఇదేమి చిత్రమమ్మా! ఏళ్ళుపైొచ్చి వయస్సు ముదిరిపోతూంటే యింకా పెళ్ళి కాలేదు. ఇంకెప్పుడూ పళ్ళూడిన తర్వాతనా. అవ్వ!" అని నోరు నొక్కుకున్నారంటే అందుల్లో ఆశ్చర్యమేముంది చెప్పండి.

మావాడికి పిల్ల నివ్వరేమో అనేందుకు, ఆయనేం కురూపికాదు. అంత నవమన్మథుడు కాకపోయినా ఏ కన్యయినా అసహ్యించుకోదనిమాత్రం ఘంటాపదంగా చెప్పగలను. ఇక చదువు విషయం- ఆ వూరిలో మాదొక్కటే బాగా చదువుకున్న వంశం. మా నాన్న బి. ఏ. మా అన్నయ్యమాత్రం ఇంటరుతో చదువుకు స్వస్తి చెప్పి వ్యాపారంలోదిగి, ఇప్పటికి నాలుగు సంవత్సరాలుగా మా వూరి సహకార చేనేత సంఘానికిఅధ్యక్షుడుగావుంటున్నాడు. మొన్న మొన్ననే ప్రభుత్వంవారికి చేనేత విషయాలలో సలహా సంఘ సభ్యుడుగాకూడ ఎన్నుకోబడ్డాడు. మరి యింత చదువూ, యింత పదవీ వుండి కూడా, మా అన్నయ్యకు యింతవరకూ పెండ్లి కానందుకు ముఖ్య కారణం, మా అమ్మా నాన్నా శ్రద్ధ తీసుకోకపోవడమే అనాలి. ఎందుకో మావాడుకూడ పెండ్లిఅంటే అంత శ్రద్ధ చూపేవాడు కాదు.

మా అన్నయ్య మంచితనాన్ని, ఉదార స్వభావాన్ని ఆ వూరిలో పొగడనివారుండరు. పాలరాయివంటి స్వచ్ఛమయిన చంద్రబింబంలో కూడ ఒక మచ్చ వుండడమనే విషయం నగ్న సత్యం! అది సార్థకం చేసేందుకే కాబోలు మా అన్నయ్య ఈమధ్య అక్కడక్కడ గోడలు దూకుతున్నాడనే వదంతులు కుక్క గొడుగుల్లా బయల్దేరాయి. ఈ వదంతుల్లో ఎంతమాత్రం సత్యముందనే విషయం నేను చెప్పలేను కాని ఒకవేళ నిజమైతేమాత్రం, వయస్సు వచ్చిన వ్యక్తి చూడండి—ఏమంటారు?

యువకులకు ఇలాంటి పొట్లు కలుగుతుంటాయనే ఏదో తమ శక్తికొలది మానవసేవ చేస్తామనే కొందరు పనిలేని పెద్ద మనుష్యులు అప్పుడప్పుడు వచ్చి మా నాన్నను కదిలిస్తూ "ఏమండీ, రంగయ్యగారూ, కాలాలు మారిపోతున్నాయంటే మారిపోవ్వూ మరి."

"నిజమే. అందుకు కారణ మేమిటంటారు" అన్నారు మా నాన్న. "ఆ కారణాలకేంగాదువ, అన్నీ వైపరీత్యాలే. పెండ్లికి కాకూడని వారికి పెండ్లిండ్లు, పెళ్ళి కావలసిన వారికి పెళ్ళి కాకపోవడాలు. అం.తే"

"ఏమిటో మీరంతా చాలా నిగూఢంగా మాట్లాడుతున్నారు."

"అహహ, జరిగే విషయం చెబుతున్నా, ఉదాహరణకు మనబ్బాయి సంగతి చూడండి. ఇంతవయస్సు వచ్చి పెండ్లికాని అబ్బాయిని చూడడం నాకు యిదే మొదటిసారి."

"మీ ధోరణి చూస్తుంటే ఏదో రాయబారపు తంతులాగుందే" అన్నాడు నవ్వుతూ కుండ బద్దలుకొట్టినట్లు.

మొహమాట మెరుగని మా నాన్న ధోరణికి వచ్చినతను కప్పలా నోరు తెరచి ఆశ్చర్యపడ్డా, మరుసటి క్షణంలో తమాయించుకొని,

"అబ్బెబ్బె, నాకింతకన్నా పని లేదటండీ. ఏదో తెలుసుకుందామని" అన్నాడు.

"అబ్బాయి తనకు తానై తొందరపడందే పెండ్లి విషయమై నేనేం అవసరపడదల్చుకోలేదండీ" అని సమస్యాపరిష్కారం చేశారు మా నాన్నగారు.

కాలం దొర్లిపోతోంది. మా అన్నయ్య మాత్రం యింకా పెండ్లి చేసుకోలా. ఎదురైన వాడల్లా,

"ఏమయ్యా వెంకట్రామయ్యా. నువ్వెప్పుడు పెండ్లిచేసుకోవడం, మేమెప్పుడు విందు లారగించడం" అనేవారు. మా వూరిలో కడకు యిది ఎలా తయారయ్యిందంటే, పరిష్కరింపబడని హిందూదేశపు ఆహారసమస్యంత తీవ్రరూపం దాల్చిందంటే అతిశయోక్తి కాదనాలి.

ఇలాంటి పరిస్థితులలో, మా వూరి సంప్రదాయాన్ని యిప్పటికైనా ఉద్ధరిస్తామనే వుద్దేశంతో బయల్దేరాడొక పెళ్ళిళ్ళ పేరయ్య. రాత్రి భోజనాలయ్యాక తోటలో చేరి ఒక మంచంపైన పడుకొని గాలిమేస్తున్నాము, మా అన్నయ్యా, నేనూను. చేతికర్ర టకటక లాడించుకుంటూ వస్తూన్న పేరయ్యను చూచి,

"రండి. రండి పేరయ్యగారూ! బహుకాల దర్శనం. అయినా వూరకరారు మహాత్ములు" అని ఆహ్వానించాడు మా అన్నయ్య. ఏదో పిచ్చాపాటి మాట్లాడి,

"ఏంబాబూ! ఎవరి నుద్ధరించాలనుకున్నావు ఈ బ్రహ్మచర్య వ్రతంతో" అని ప్రథమ హాస్యంతో కార్యరంగంలోకిదిగాడు పేరయ్య.

"అదేమిటండీ పెళ్ళి చేసుకోకుండా వుండటం ఎవరినన్నా ఉద్ధరించడానికేనా. అయినా ఇప్పుడొచ్చిన అవసరమేమిటిలెద్దురూ."

"అవసరమేమిటి! అయ్యో రామా! నీ వయస్సొచ్చేటప్పటికి నాకెంతమందిపిల్లలో తెలుసా?— అయిదుమంది. ఆ. అసలు విషయమేమిటంటే మొన్న పత్తికొండకు పోయి చూసి వచ్చాను. ఇక్కడికి నూరుమైళ్లుంటుందిలే. దొండపండులాంటి పిల్ల. ఈ సమయం జార్చుకున్నావంటే ఇక దొరకదు. అటువంటి దేవతామూర్తి! బాగా చదువుకున్న కుటుంబం కూడాను. ఇద్దరన్నలు, తండ్రి మంచి హోదాలో వున్నాడు. మీ వంశంలాంటివారు చేసుకోవలసిన సంబంధం."

"పిల్ల ఏమాత్రం చదువుకుంది" అన్నాడు మా అన్నయ్య.

"ఎంతవరకు చదువుకుందో నాకంతసరిగ్గా తెలియదు కానీ... తెలుగు బాగా చదువుకుంది" అని నణిగాడు.

"అయితే యింకేం, బొగ్గుతో గోడలపైన చాకలిపద్దులు వ్రాయకలదనుకుంటా" అని నవ్వడం మొదలెట్టాడు అన్నయ్య.

పాపం! పేరయ్య ముఖం చింతాకంత అయిపోవడం వెన్నెల దాచలేకపోయింది. కానీ అంత సులభంగా ఓటమి ఒప్పుకునే రకం కాదని నాకు బాగా తెలుసు.

"ఇదిగో బాబూ! నేను తెచ్చిన సంబంధాన్ని నువ్వంత సులభంగా కొట్టేస్తే నేనొప్పుకునే రకంగాదు. ఒకసారి వెళ్ళి చూసి, 'నాకు నచ్చలేదు' అని చెప్పు—అప్పుడు ఒక చెంప మీసం తీసెయ్యకపోతే నా పేరు పేరయ్య కాదనుకో" అని సవాలుచేసి మీసం మెలి పెట్టాడు. ఎలాగయితేనేం "పత్తికొండకు పోయి పిల్లను చూసివస్తాను" అని మా అన్నయ్య చేత చెప్పించి మరీ కదిలాడు తోటలోంచి పేరయ్య.

రెండుమూడు రోజుల తర్వాత పిల్లను చూసేందుకు వస్తున్నారని పేరయ్యచేత పత్తికొండకు జాబు వ్రాయించి యింటివద్ద అసలు విషయము చెప్పకుండా, ఒక స్నేహితుణ్ణి చూసేందుకు పోతున్నామని బొంకి బయలుదేరాము మా అన్నయ్యా, నేనూను.

అక్కడికి వెళ్ళిన తర్వాత పేరయ్య చెప్పిన విషయాలన్నీ నిజంగానే కన్పించాయి. మంచి సంస్కారంగల కుటుంబం. అమ్మాయి కొంచెము

పొట్టి అయినా అందంగా వుంది. వాళ్ళ అమ్మమ్మ పట్టు పట్టటంవల్ల ఎనిదవ తరగతికన్నా ఎక్కువ చదువు చెప్పించ లేదట. పేరేమిటి అని రెండు మూడు మార్లు ప్రశ్నించగా సిగ్గుతో నవనవలాడుతూ "వెంకటమ్మ" అనింది ఎంతో ప్రయత్న పూర్వకంగా. సంతోషము, సంతృప్తితో వెల్లి విరిసిన మా అన్నయ్య ముఖం ఆ పేరు వినంగానే ఎందుకో ఒకక్షణం ముడుచుకొనిపోయింది.

పెండ్లి చూపులకు వెళ్లిన అందరిలాగు భరత నాట్యం వచ్చునా లేక కథాకళివచ్చునా, జావళీ లేక నవ్య గేయాలు వచ్చునా, గార్ధభస్వరమా లేక కోకిల గానమా అనే చవట ప్రశ్నలు వెయ్యానందుకు మావాడిని ఏ విధంగా అభినందించాలో నాకింతవరకూ తెలియలేదు. ఎందుకనుకుంటారేమో - శరద్రాత్రులలో ప్రియురాలు మత్తెక్కించే మధురమైన సంగీతాన్ని ఆలాపిస్తూంటే ఆ మత్తులో జోగి స్వర్గవీథుల్లో విహరించాలనుకున్న మా స్నేహితుడొకడు యిప్పటికి ఆ సంవత్సరాల క్రిందట తను కోరినట్టు వెదికివెదికి ఒక అమ్మాయిని పెండ్లి చేసుకున్నాడు. ఎప్పుడైనా చెవులకు పట్టిన త్రుప్పు వదిలించుకోవటానికి పాటపాడమని ఆమెను బ్రతిమాలగా బ్రతిమాలగా, పెండ్లిచూపులకు వచ్చినప్పుడు పాడిన పాటల్లో ఒకటి మొదలెట్టేది. ఆ క్రీస్తు పూర్వపు పాట వినలేక అంతటితో గుండెలదిరి, చెవులు మూసుకొని, యిక అపాట ఆపమని బ్రతిమాలి తర్వాత దోమల సంగీతానికి నిద్రపోయేవాడు. పెండ్లి మార్కెట్టులో అమ్ముడు బోయేందుకు లలిత కళను సాధన చేసే ఈ వధువులంతా పెండ్లి కాగానే జీవిత లక్ష్యాన్ని సాధించామని చేతులు దులుపుకొని, సాధనచేసే కళలకు ఒకసలాం కొట్టేస్తారు!

పత్తికొండనుండి మరునాడే బయల్దేరాము. రైల్లో కూర్చొని వెనుకకు పరుగెత్తే చెట్ల చేమల వంక తదేక ధ్యానముతో కిటికీ గుండా చూస్తూ కూర్చున్నా.

"ఏంరా తమ్ముడూ" అన్నయ్య పిలిచాడు. వెను దిరిగి చూశాను.

"నీ అభిప్రాయమేమిటి"

"దేన్నిగురించి" అన్నా ఏమీ తెలియని వాడికి మల్లె.

"అదేరా, ఆ సంబంధం గురించి"

"ఇందులో నా అభిప్రాయమెందుకూ. చేసుకునే వాడివి నువ్వు, నచ్చితే చేసుకో. ఏం నచ్చలా?"

"నచ్చకపోవడమేమిటిలే. ఓరేయి తమ్ముడూ పేరయ్య చెప్పినట్టు నిజంగా దేవతా మూర్తేరా. ఈ సంబంధం తప్పిందంటే యిక నాకు పెళ్లి కాదేమో! — కానీ —"

"కానీ ఏమిటి?"

"అన్నీ బాగున్నాయి కానీ ఆ అమ్మాయి పేరు నాకు నచ్చలేదురా"

"ఏం. పేరుకేం?"

"ఛ! ఏం పేరురా - వెంకటమ్మట వెంకటమ్మ. - మనవూరిలో దోసెల వెంకటమ్మ లాగు."

"వెంకటమ్మా అని పిలవకపోతే 'ఎంకి' అని పిలు. నాయుడు బావలాగు ఎంకి పాటలు పాడుకో వచ్చు" అన్నా నవ్వుతూ.

"ఏడిసినట్లే ఉంది నీ సమర్థన" అని ముఖం మరోవైపుకి తిప్పుకొని భవిష్యత్తును గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు.

ఇంటికి చేరినతర్వాత అన్ని విషయాలు పూసగుచ్చినట్టు అమ్మా నాన్నా ముందు ఏకరువు పెట్టి, "యిక మీరు చూడడమే తరువాయి. మీకు నచ్చితే ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలని వుంది" అన్నాడు అన్నయ్య. ఆ చెప్పే ధోరణి, ఆ వుద్రేకంలో చూస్తే మా వాడికి ఆ అమ్మాయిని గూర్చిన పిచ్చి బాగాతలకెక్కినట్లు కనిపిస్తుంది. అందుకనే మా అమ్మతో,

"అమ్మాయి నిజంగా బాగుందే. తలపెట్టక తలపెట్టక యిప్పుడు ఆ సంబంధాన్ని చేసుకోవాలని వుబలాట పడుతున్నాడు. ఏదో మీరు చూచి వచ్చి చెయ్యడం మంచిది" అన్నా పెద్ద వ్యవహార వేత్తలాగు.

"సరేలేరా. మేముకూడా చూసిరానీ" అని వంటింట్లోకి నడిచింది.

అన్నయ్య బలవంతంవల్ల వారం రోజుల లోపల, అమ్మా నాన్నా పత్తికొండకు పోవడం, పిల్లను చూసిరావడం అంతా జరిగిపోయింది.

సంబంధం నిశ్చయం చేసుకున్నట్లు జాబులు నడిచాయి. అన్నయ్య సంతోషం యింతింత అని చెప్పలేము. కానీ యింత సంతోషములోనూ మా వాడికి ఒకే ఒక బెంగ పట్టుకుంది. ఏమిటంటే— ఆ అమ్మాయి పేరును గురించి. ఆ పేరుతనకు నచ్చలేదనీ, పేరు మార్చాలనీ చూచాయగా అన్నాడు అమ్మా నాన్నతో. ఎవ్వరూ దీన్ని గురించి అంతగా పట్టించుకోలేదు. ఇక ముహూర్తం నిర్ణయించేదుకు జ్యోతిష్కుని పిలిపించాలనుకుంటున్న సమయంలో ధైర్యంచేసి ఖచ్చితంగా చెప్పేశాడు నాన్నతో, పేరు మార్చెయ్యాలని.

"నీకు పిచ్చెక్కిందా ఏమిట్రా. పుట్టినప్పుడు పెట్టిన పేరు క్షణంలో మార్చాలంటావు. పెళ్ళయింతర్వాత నీయిష్టమొచ్చిన పేరుతో పిలుచుకో. ఎవరొద్దన్నారు" అన్నారు నాన్న.

లోపల తను పడుతున్న భాధను సిగ్గుతో వ్యక్త పరచలేక తలవంచుకొని సేరుగా నా దగ్గరవచ్చి,

"ఒరేయి తమ్ముడూ. ఎవ్వరూ నా బాధ అర్థం చేసుకునేటట్టు లేదురా" అన్నాడు.

"ఏమిటి" అన్నా వివర్ణమయిన అన్నయ్య ముఖంచూచి.

"ఏమిటేమిటి నా మొఖం. మనయింట్లో పెండ్లంటే ఎంతోమంది చదువుకున్న వాళ్లూ, స్నేహితులు వస్తారు. వాళ్ళంతా ఆ పేరును విని ఎగతాళి చేస్తూంటే నా తల తీసేసినట్లుండదూ ?"

అతనిబాధ నాకర్థమయింది. అన్నయ్య అమాయకత్వానికి ఒకవైపు నవ్వూ మరోవైపు జాలీ పుట్టుకొచ్చింది.యిందుకు ఏదో ఒక మార్గం వెదకకపోతే బావుండదని ఆలోచించడం సాగించా. బుద్ధికి అసాధ్యమయింది లేదని నమ్మేవారిలో నేనొకణ్ణి. బుఱ్ఱలో కొంచెం కుస్తీ పట్టింతర్వాత ఒక ఉపాయం తట్టుకుంది. ఆతురతతో,

"పెళ్ళికి లగ్నం పెట్టేదెవరు?" అనిఅడిగా.

"ఇక ఎవరుంటారు, ఆ జిత్తులమారి నక్క సుబ్బరాయుడే"

"అయితే నీ కోరిక ఫలించినట్లే. నీవు నిశ్చింతగా వుండొచ్చు" అన్నా.

"అదెలాగు ?" అన్నాడు ఆశగా.

"నేను సరిచేస్తాగా. ఒక్క నూరు రూపాయలు ఖర్చు అంతే" అన్నా ధీమాగా.

ఈ లగ్నం పెట్టబోయే సుబ్బరాయుడు, మాకు దూరపుచుట్టం. వరసకు మామ అవుతాడు. చిన్నప్పుడు రౌడీగా తిరిగి, "బోగంది ముసలిదయితే పతివ్రత అవుతుందన్నట్లు," వయస్సుపై బడ్డాక పుస్తకాలుచూసి జ్యోతిషం చెప్పడం నేర్చుకున్నాడు. ఎవరికి కావలసిన మాటలు వారికి తియ్యగాచెప్పి జీవితం సాఫీగా సాగిస్తున్నాడు. ఎటువైపు చేతికి కొంచెం లేమ తగిలితే అటువైపు మొగ్గేరకం. మా నాన్నకు అతను ఎంత చెబితే అంత. ఎందుకో అతనిపైన అంత గురి కుదిరింది.

ఆ దినం సాయంకాలం అతణ్ణి వెంటబెట్టుకొని చెరువుగట్టుకు పోయాను.

"ఏం మామా! ఎలావుంది వ్యాపారం?" అన్నా ఎప్పటి హాస్య ధోరణిలో.

"అంతేలేవోయి. మమ్మల్ని చూస్తే ఈ కాలపువారికి ఎగతాళి"

అబ్బెబ్బె. ఎంతమాట యిప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నా. మీలాంటి జ్యోతిష్కులవల్ల కలిగే లాభాలు."

"ఏమిటో ఎత్తువేసేటట్టున్నావే" అన్నాడు వ్యంగ్యాన్ని పసికడుతూ.

"ఏమీలేదు మామా. ఒక్క చిన్న సహాయం చెయ్యాలి. చెప్పినట్టు చేశావంటేనా" అని నూరు రూపాయల నోటు కళ్ళముందు ఆడించాను.

అతని కళ్లు జిగేలుమన్నాయి.

"ఏమిటా సహాయం" అన్నాడు నోటు వంక ఆశగా చూస్తూ.

"అన్నయ్యకు సంబంధం ఖాయమైందని తెలుసుగా. ఎందుకో ఆయనకు ఆ అమ్మాయి పేరు నచ్చడంలేదు. పేరు మార్చెయ్యాలని పట్టుపడుతున్నాడు. నువ్వు ఎలాగయినా పేరు మార్పు వచ్చేట్లు లగ్నం పెట్టాలి అంతే".

"ఓస్! అదెంతసేపు. ఆ నోటు యిలా పడెయ్యి" అన్నాడు.

"ఆ పప్పులు మనదగ్గరేం ఉడకవు. లగ్న పత్రికలో అతనికి నచ్చిన పేరు కన్పించిన తర్వా

తనే ఇది నీచేతికి రావడం" అని నూరు రూపాయిల నోటు జేబులో పెట్టేసుకున్నాను.

అనుకున్న ప్రకారం నాన్నగారు లగ్నం పెట్టమని సుబ్బరాయుణ్ణి కోరారు. రాత్రి పది గంటలవరకు పంచాగం తిరగేసి, "వచ్చే నెల 9వ తేదీ ఒక లగ్నంవుంది. అది తప్ప ఈ సంవత్సరం ఆఖరివరకు సరియైన లగ్నాలు లేనే లేవు. ఆ లగ్నమయినా తారాబలం సరిలేదు. కాబట్టి పేరు మార్చెయ్యాలి అని" తీర్మానం చేశాడు. ఏదో కాలంకలిసొచ్చి సుబ్బరాయుడు చెప్పింది యథార్థమే అయింది! మా నాన్నగారికి కూడ జోతిషంలో అంతో యింతో పరిచయం లేకపోలేదు. ఆ పరిచయం ఎంత వరకూ అంటే, ఒకరు చెప్పినదాంట్లో బాగోగులు గమనించేంతవర్కే. తనకు స్వతహాగా లగ్న నిర్ణయ శక్తి లేనందువల్లనూ, పెళ్లి సంవత్సరం వరకు ఆపుచేయడం బాగుండదనీ, వూళ్లో కొందరు పెద్ద మనుష్యులు ఈ లగ్నంలో తప్పులు చూపించినా, ఆ ముహూర్తం ఖాయం చేశారు.

పెండ్లి కార్యాలలో లగ్నాల యొక్క ఉత్తమ నీచత్వాలను బట్టి నూతన వధూవరుల యొక్క, వారి కుటుంబాల యొక్క జీవిత మార్గాలు పూలబాటలో కంటకావృతాలో అవుతాయని గట్టిగా నమ్మినవారిలో మా నాన్నగారొకరు. విధి నిర్ణయము అనుల్లంఘనీయము అని వాదించే మా నాన్నగారే తారాబలము సరిగా వేసి 9వ తేదీ లగ్నంవల్ల వచ్చే అనర్థాలకు ఒక్క చిటికెలో పేరు మార్చివేసి తమ కనుకూలంగా చేసుకోవడం విచిత్రంగా లేదూ!

అన్నయ్య కోరిన ప్రకారం లగ్నపత్రికలో "జ్యోతి" అని వ్రాసి బయటికి అడుగు పెట్టేటప్పటికి, సుబ్బరాయుడుగారి లాల్చీ జేబులోంచి నూరు రూపాయల నోటు తొంగి చూస్తోంది.

అన్నయ్య రొట్టివిరిగి నేతిలో పడింది. వివాహం సలక్షణంగా జరిగింది. మొదటిరాత్రి గదిలో సిగ్గుతో తలవంచుకొని కలలుగంటున్న నవవధువును చూచి, "జ్యోతీ" అని పిలిచాడు ఆప్యాయంగా.

# తీర్చిన చేబదులు

"ఏరా! బజారుకి వెళితే పంచదార, కాఫీ గింజలు తీసుకురండి" అని ఆర్డరిచ్చింది మా సరళ, అధికారస్వరం ఉట్టిపడుతూ. నే నెప్పుడూ సరళ ఆర్డర్లకు విధేయుడిని. నేను షర్టు ధరించి వీథిలో అడుగు పెట్టేసరికి "చీకటి పడకుండా రండి" అని కేకేసింది. నేను ఎక్కడా ఆగకుండా షాపుకి వెళ్ళాను. సామానులు తీసుకుని డబ్బిచ్చబోతూంటే, ఒక పరిచయ కంఠం వినిపించింది.

"హల్లో! యిక్కడనిన్ను కలుసుకున్నందుకు చాల అదృష్టవంతుణ్ణి" అన్నాడు వెంకట్రావ్.

"ఏమిటోయ్ విశేషాలు?" అన్నా.

"విశేషాల కేమిటిగాని, ఐదు రూపాయలుంటే యిద్దూ" అన్నాడు నేను లేవనలేక పోయాను. "వచ్చేవారం" ఇచ్చేస్తా అన్నాడు.

మూడు వారాలు దొర్లిపోయాయి. అతను చెప్పిన "వచ్చేవారం" యింకా రాలేదు! ఆవేళ రోడ్డుమీద వెంకట్రావ్ కనిపిస్తే చడామడా తిట్టేను. తలవంచుకుని వెళ్ళిపోయాడు.

సాయంత్రం ఊళ్ళో కనిపించి, అయిదు రూపాయల నోటు నాచేతిలోపెట్టి "క్షమించు ఆలస్యానికి" అని వెళ్ళిపోయాడు వెంకట్రావ్. అనవసరంగా ఇంత మంచి మిత్రుడిని తూలనాడేనే, అని విచారించింది నా హృదయం.

ఇంట్లో అడుగుపెట్టేసరికి "వెంకట్రావ్ భార్య వచ్చింది పొద్దున" అంది సరళ.

"ఏం?" అన్నాను.

"వాళ్ల ఆయన ఎవరో పిసినిగొట్టుకి ఐదు రూపాయలు బాకీ ఉన్నాడట. వాడు చాలా బాధిస్తున్నాడుట. అంచేత అయిదు రూపాయలుంటే ఇమ్మంది. వచ్చేవారం యిచ్చేస్తానంది."

"ఇచ్చావా?" అన్నా.

"ఆఁ ఏం, అలా యిదవుతారు" అంది నా ముఖంలో ముఖం పెట్టి.

"అబ్బే ఏమీ లేదు" అన్నాను.

—"ఆటం"